బోయినపల్లి వినోద్ కుమార్ పరామర్శ



పెద్దపల్లి మాజీ ఎంపీ గొట్టే భూపతిని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ వినోద్ కుమార్

కార్పొరేషన్, డిసెంబర్ 15: పెద్దపల్లి మాజీ ఎంపీ గొట్టే భూపతి సతీమణి, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు తల్లి శాంత అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, ఆదివారం మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కరీంనగర్‌లోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్ , బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, సంపత్ తదితరులు ఉన్నారు.

ఐఎంఎస్‌సీలో కలెక్టర్ దంపతులు

క్యాంటీన్ నిర్వాహకురాలితో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్, డిసెంబర్ 15 : కలెక్టరేట్ ప్రాంగణంలో ఇటీవల ప్రారంభించిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను కలెక్టర్ పమేలా సత్పతి దంపతులు ఆదివారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహార పదార్థాలు పరిశీలించారు. క్యాంటీన్ నిర్వహణను సమాజ సేవలో ఒక భాగంగా పరిగణిస్తూ, నాణ్యమైన ఆహార పదార్థాలు వినియోగదారులకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. క్యాంటీన్‌లో నిరంతరం పరిశుభ్రత పాటించాలన్నారు. కొద్దిసేపు గడిపిన అనంతరం కలెక్టర్ దంపతులు టీ తాగారు. నిత్యం బిజీగా ఉండే కలెక్టర్ తీరిక చేసుకుని క్యాంటీన్‌కు రావడంతో నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. కలెక్టర్‌తో కలిసి ఫొటోలు దిగారు.

ముస్లింల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న మహ్మద్ ముజాహిద్ హుస్సేన్

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్15: హుజూరాబాద్ నియోజకవర్గంలోని ముస్లింలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ తీసుకోవాలని హుజూరాబాద్ డివిజన్ మసీద్ ఈద్గా ఖబ్రస్థాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుల అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ కోరారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజూరాబాద్‌లోని ముస్లిం షాదీఖానాకు, నియోజకవర్గంలో ఉన్న పలు మసీదులు, ఖబ్రస్థాన్‌ల చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మొహమ్మద్ జాకీర్, మొహమ్మద్ అక్బర్‌తో పాటు వివిధ కమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

నీటి బొట్టు ఒడిసిపట్టేదెలా?

జలం ప్రాణికోటికి జీవనాధారం. నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఒక్కరూ పాటుపడినప్పుడే మానవ మనుగడ సాధ్యం. దీనిని గుర్తించిన గత బీఆర్ఎస్ సర్కారు, జలసంరక్షణ చర్యలకు ప్రాధాన్యమిచ్చింది. నీటి ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఇంటింటా ఇంకుడు గుంత నిర్మాణం తప్పనిసరి చేసింది. అయితే, ఏడాది కాలంగా నూతన భవన నిర్మాణాల్లోనూ వాటి జాడ లేకపోగా, కాంగ్రెస్ పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

- కలెక్టరేట్, డిసెంబర్ 15

మానకొండూర్‌లో అసంపూర్తిగా నిలిచిన ఇంకుడు గుంత

- ఏడాది కాలంలో జిల్లా వ్యాప్తంగా 10వేల ఇళ్ల నిర్మాణం
- వీటిలో రెండు శాతానికే ఇంకుడు గుంతలు పరిమితం
- భూగర్భజలాల పెంపునకు చర్యలు శూన్యం
- లక్ష్యంపై అధికారులు, పాలకుల నిర్లక్ష్యం

జిల్లాలో ఏటేటా పెరుగుతున్న నీటి కొరత నేపథ్యంలో ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టేలా సంబంధితాధికారులు చర్యలు తీసుకోవాలని, ఇళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసే ముందు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ విధానం ఏర్పాటు చేసుకోవాలని ఆదేశిస్తూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2012 ఏప్రిల్ 7న జీవోనం.168తో ఉత్తర్వులు విడుదల చేసింది. ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, కేంద్రం నుంచి వచ్చే నిధులతో పాటు అదనంగా మరిన్ని నిధులు విడుదల చేస్తూ, ప్రోత్సహించింది. ఫలితంగా జిల్లాలో రెండేళ్లకాలంలో కొత్తగా నిర్మించుకున్న ఇళ్లలో 60 శాతానికి పైగా ఇంకుడు గుంతల నిర్మాణం జరిగింది. రెండేళ్లలో 50వేల పైచిలుకు జిల్లాకు మంజూరు కాగా, 32వేలకు పైగా పూర్తయినట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. అలాగే, ఉన్న ఇళ్లల్లో కూడా మెజారిటీ సంఖ్యలో పూర్తయ్యాయి. వర్షాకాలంలో వర్షపు నీటితో పాటు సాధారణ రోజుల్లో ఇళ్ల నుంచి వెలువడే వృథా నీరు కూడా భూగర్భంలోకి ఇంకుతుండగా, బోరు బావుల్లో నీటి లభ్యత పెరిగేది.

ఇంకుడు గుంత లేకుండానే ఇళ్ల నిర్మాణం

ఏడాది నుంచి వీటి నిర్మాణంపై అధికారులు గానీ, పాలకులు గానీ అంతగా పట్టించుకోకపోవడంతో నూతన గృహాల నిర్మాణం వేల సంఖ్యలో పెరుగుతున్నా, ఇంకుడు గుంతలు మాత్రం వందల్లో కూడా నిర్మించుకోవడం లేదని అధికారుల గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం జిల్లా వ్యాప్తంగా 10వేల వరకు నూతనంగా ఇళ్ల నిర్మాణం మొదలు కాగా, వీటిలో రెండు శాతం కూడా ఇంకుడు గుంతల పనులు చేపట్టలేదు. ప్రధానంగా కమర్షియల్ కాంప్లెక్సులు, అపార్టుమెంట్లు, భారీ భవంతుల్లో కూడా ఇంకుడు గుంతల నిర్మాణం కచ్చితంగా చేపట్టాలని, ఇళ్ల యజమానులు పట్టించుకోపోతే భారీగా జరిమానా విధించాలని జీవో నం.168 చెబుతున్నా, అధికారుల నిర్లక్ష్యంతో అది పకడ్బందీగా అమలు కాని పరిస్థితి నెలకొన్నది. ఈ క్రమంలో ఇళ్ల యజమానులు ఏమాత్రం పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వెదిరలో ఎరువుల గోదాము, రైతు సేవా కేంద్రాలను ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

సహకార సంఘాల అభివృద్ధికి కృషి

- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

రామడుగు, డిసెంబర్15 : సహకార సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. రామడుగు మండలం వెదిరలో రామడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.56 లక్షలతో నిర్మించిన ఎరువుల గోదాము, రైతు సేవా కేంద్రాలను ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సహకార సంఘాలు రైతులకు వెన్నెముకలాంటివన్నారు. సింగిల్‌విండోలను అభివృద్ధి చేయడం ద్వారా రైతులు కూడా ప్రగతి పథం వైపు నడిచే అవకాశం ఉందన్నారు. వెదిరలో నిర్మించిన గోదాముతో పాటు రైతు సేవాకేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, రామడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ, ఏర్పాటు చేసిన నాటినుంచి అనేకమంది రైతులకు చేయూతనందిస్తున్నదన్నారు. పాలకవర్గ సహకారంతో సంఘాన్ని దినదినాభివృద్ధి చేస్తూ, అన్నదాతల సేవలో ఎన్నో మైలురాళ్లను దాటిందన్నారు. రానున్న రోజుల్లో రెట్టించిన ఉత్సాహంతో సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో అల్లి చైర్మన్ ఉప్పల అంజనీప్రసాద్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ గంట్ల రవీందర్‌రెడ్డి, కార్యదర్శి మల్లేశం, మండల వ్యవసాయ అధికారి త్రివేదిక, పాలకవర్గ సభ్యులు, కొక్కెరకుంట విండో చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మండలాధ్యక్షులు జవ్వాజి హరీశ్, గంట్ల జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

గంగాధర, డిసెంబర్ 15 : మధురానగర్ చౌరస్తాలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతుండడంపై 'ట్రాఫిక్ చక్రవ్యూహంలో మధురానగర్ చౌరస్తా' శీర్షికన ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ వార్తా కథనానికి స్పందించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మధురానగర్ చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సీపీ అభిషేక్ మొహంతిని కోరగా, కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే, రోడ్డుపై కాకుండా బస్ స్టేషన్‌లోనే బస్సులు నిలిపేలా చూడాలని డిపో మేనేజర్‌ను కోరినట్లు వెల్లడించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆదర్శ విద్యార్థిని ఎంపిక

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 15: జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి గణిత ప్రతిభ పరీక్షలో పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మాచర్ల రిషిక అత్యుత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి మధుసూదనాచారి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఉపాధ్యాయులు అభినందించారు.

పొట్టి శ్రీరాములు వర్ధంతి

అల్పాహారం పంపిణీ చేస్తున్న ఆర్య వైశ్య సంఘం బాధ్యులు నగునూరి రాజేందర్, కన్న కృష్ణ తదితరులు

విద్యానగర్, డిసెంబర్ 15: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని కరీంనగర్ పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు చౌక్‌లో నిర్వహించారు. ఆర్య వైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని మహనీయుడికి ఘనంగా నివాళులర్పించారు. ఆర్య వైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు నగునూరి రాజేందర్, జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కన్న కృష్ణ మాట్లాడుతూ, తెలుగు రాష్ట్ర సాధన కోసం 56 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి చివరకు ప్రాణాలు అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. మహాత్మా గాంధీ ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు. అనంతరం 300 మందికి అల్పాహారం వితరణ చేశారు. కార్యక్రమంలో వైశ్య సేవా కేంద్రం అధ్యక్షుడు చిదుర సురేశ్, కార్పొరేటర్ వంగల శ్రీదేవీపవన్, మాజీ అధ్యక్షుడు ఏవీ మల్లికార్జున్, కొమురవెల్లి వెంకటేశం, ఉప్పల రామేశం, రాకేశ్ కుమార్, పెద్ది వేణుగోపాల్, సుద్దాల వెంకటేశ్, కొంజర్ల శ్రీకాంత్, జిల్లా మహిళా అధ్యక్షురాలు చకిలం స్వప్న, పట్టణ మహిళా అధ్యక్షురాలు రావికంటి భాగ్యలక్ష్మి, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు జీడిగే సాయికృష్ణ, యువజన సంఘం పట్టణాధ్యక్షుడు తణుకు సాయికృష్ణ, కన్న సాయి, సూరజ్, మెహర్, అభ్యుదయ సంఘాల అధ్యక్షులు, వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వీణవంక, డిసెంబర్ 15: ఆదిత్య సేవా అభ్యుదయ ఆర్ఎంపీ, పీఎంపీ మండల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఎన్ఆర్ సహకారంతో మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా గ్రామంలోని 250 మంది ప్రజలకు ఆయా వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ తోట తిరుపతి వైద్య పరీక్షలు చేయించుకొని మాట్లాడుతూ, పేదల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం హర్షించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మ్యాకల ఎల్లారెడ్డి, ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ మండలాధ్యక్షుడు కంకణాల శ్యాంసుందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి మార్క అంజిబాబు, గ్రామీణ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

గంగిపల్లిలో ..

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 15: గంగిపల్లిలో ఆదివారం డాక్టర్ వెంకట రెడ్డి కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ బి.వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ కె.శృతి దాదాపు 200 మందికి బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. సొంత గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినందుకు గ్రామస్తులు బండ సంపత్ రెడ్డి, పారిపెల్లి శ్రీనివాస్ రెడ్డి డాక్టర్లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

'శిశు మందిర్'లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జమ్మికుంట, డిసెంబర్15: పట్టణంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో 1985-86 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ గత అనుభవాలను నెమరువేసుకున్నారు. కుటుంబ నేపథ్యం, స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు సాంబయ్య, శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయం సమితి అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, విద్యాపీఠం కార్యదర్శి రాజమౌళి, రాజారెడ్డి, రాజేందర్, శ్రీనివాస్, రవీందర్, మాధవరెడ్డి, రమేశ్, శివయ్య, శ్రీమన్నారాయణ, జయప్రకాశ్, నిరూపమ, సుదర్శన్, ఆచార్యులు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

గన్నేరువరం, డిసెంబర్ 15: గుండ్లపల్లి స్టేజీ వద్ద ఆదివారం రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న టాటా సుమో వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అతడు మృతి చెందాడని ఎస్ఐ తాండ నరేశ్ తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచినట్లు చెప్పారు. మృతుడికి సుమారు 30 సంవత్సరాల వయసు ఉంటుందని, ఎవరికైనా వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

స్కూల్ వ్యాన్ దగ్ధం

మంటల్లో కాలుతున్న స్కూల్ వ్యాన్

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 14: పట్టణంలోని మాంటిస్సోరి హైస్కూల్‌కు చెందిన వ్యాన్ ఆదివారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురై దగ్ధమైంది. ఆదివారం సెలవు కావడంతో పాఠశాలకు చెందిన వ్యాన్లన్నీ క్రీడా మైదానంలో ఉండగా, ఓ పక్కగా ఉన్న వ్యాను నుంచి మధ్యాహ్నం మంటలు వస్తున్నాయని స్థానికులు గమనించి, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పి వేశారు. సుమారు రూ.పది లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఆదివారం విద్యార్థులు లేకపోవడం, పక్కనే ఉన్న నివాస స్థలానికి నిప్పు అంటుకోకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. యాజమాన్యం ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ

మహాపడి పూజలో తోట శ్రీనివాస్ గురుస్వామి

రామడుగు, డిసెంబర్ 15 : రామడుగు మండలం గోపాల్‌రావుపేటలో స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ అర్చకుడు డింగిరి వెంకటరమణాచార్యుల నివాసంలో ఆదివారం తోట శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అయ్యప్ప విగ్రహానికి పంచామృతాలు, చందన, విభూది, పంసుపు, కుంకుమలు, పుష్పాలతో అభిషేకం చేశారు. అనంతరం పద్దెనిమిది మెట్లపై కర్పూర దీపాలను వెలిగించి స్వామివారిని కొలిచారు. కార్యక్రమంలో సుమారు రెండు వందల మంది అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 15: సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆర్. శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ జి. శ్రీనివాస్, కే. లక్ష్మణరావు, వెంకటస్వామి, తెలంగాణ బహుజన టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్ రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు వారు సంఘీభావం తెలిపారు. తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కాగా, కరీంనగర్ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఉద్యోగులు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లాప్రధాన కార్యదర్శి మహేశ్, జిల్లా ఉపాధ్యక్షులు రమేశ్, రవిచంద్ర, బి. శ్రీకాంత్, కేజీబీవీ ప్రత్యేకాధికారులు ఎం. అజిత, బి. రమాదేవి, ఎన్. పూర్ణిమ గౌతమి, పి.మాధవి, పి. కిరణ్ జ్యోతి, ఎం. స్వప్న, ఎ. సునీత, పి.కవిత, వై.భార్గవి, ఇ.లావణ్య, కే. సుప్రియ, కె.రజిత, జి. పుష్కరాణి, కె. మధులత, ఉపాధ్యక్షులు వరలక్ష్మి, నీరజ, రవిచందర్, ఆంజనేయులు, వెంకటేశ్, శ్రీకన్య, బి. రమేశ్, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్‌ను వెంటనే అమలు చేయాలి

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్15: హయ్యర్ పెన్షన్‌ను వెంటనే అమలు చేయాలని ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో రిటైర్డ్ కార్మికులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. హయ్యర్ పెన్షన్ పట్ల కార్మికులు ఆందోళనలో ఉన్నారని, అధికారులు పట్టించుకోవడంలేదని తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు అందాల్సిన సౌకర్యాలు అందడం లేదన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ చారి, సంపత్ కుమార్, టీ కనకయ్య, పాండారి, మార్త రవీందర్, వేల్పుల ప్రభాకర్, నర్సయ్య, ప్రభాకర్ రెడ్డి, మొగులయ్య, వైకే స్వామి, తదితరులున్నారు.

రిజర్వేషన్ల ద్వారానే మాదిగల అభివృద్ధి

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 15: రిజర్వేషన్ల ద్వారానే మాదిగల అభివృద్ధి సాధ్యమవుతుందని మాదిగల ఐక్య వేదిక నాయకులు అన్నారు. 'ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ.. మాదిగల సమగ్ర అభివృద్ధి కోసం మాదిగల తక్షణ కర్తవ్యం' అంశంపై ఆదివారం పట్టణంలోని మధువని గార్డెన్స్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాదిగల ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ.. రిజర్వేషన్ల విషయంలో అత్యధిక శాతంలో ఉన్న మాదిగలు పూర్తిగా నష్టపోతున్నారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై మాలలు వైఖరి మార్చుకోకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో మాదిగలను ఓట్లు అడగకూడదని, మాదిగలు ఏ పార్టీలో ఉన్నా పార్టీలకు అతీతంగా గెలిపించాలని తీర్మానాలు చేసినట్లు వారు తెలిపారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అట్రాసిటీస్ రాష్ట్ర ఇన్‌చార్జి తిప్పారపు సంపత్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రుద్రారపు రాంచందర్, మారపెల్లి శ్రీనివాస్, ఆకినపెల్లి శిరీష, మిడిదొడ్డి శ్రీనివాస్, కొండ్ర నరేశ్, మొలుగూరి పూర్ణచందర్, పర్లపెల్లి రమేశ్, మిడిదొడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు

విద్యానగర్, డిసెంబర్ 15: జిల్లా కేంద్రంలోని కిసాన్ నగర్ మూడో డివిజన్‌లో ఆదివారం ఒమేగా సుశ్రుత క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మూడు నాలుగు నెలలకు ఒకసారి రక్త పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు చేసుకుంటూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అలాగే మహిళలు వారికి తెలియకుండానే క్యాన్సర్ బారిన పడుతున్నారని, ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించేందుకు వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. శిబిరంలో అత్యధిక సంఖ్యలో ప్రజలు రక్త పరీక్షలు, బీపీ పరీక్షలు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ గుర్తింపు టెస్టులు, తదితర పరీక్షలు చేయించుకున్నారు. హాస్పిటల్ నుంచి వైద్యులు దీప్తి, అవినాష్, రాజేందర్, భవాని, శోభా, హౌసింగ్‌బోర్డుకాలనీ ఒమేగా సుశ్రుత హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★Kota Danalaxmi D/o. Sattaiah (before marriage) My Name was changded to DASARI VIJAYA W/o. DASARI VENUGOPAL (after marriage) H.No.11-5-51, Sundaraiahnagar, Sircilla Town & Mandal, Rajanna Sircilla Dist. NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైనుకి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571

9182 777 189

యాసంగి సాగుకు సమాయత్తం

- మండలంలో 13,550 ఎకరాల్లో రైతులు పంటలు వేసే అవకాశం
- గోపాల్‌పూర్‌లో రైతులు వేసిన వరి నారుమడులు

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 15: యాసంగి పంటల సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే వానకాలం ధాన్యం విక్రయించిన రైతులు, పొలాల్లో గట్లను సరిచేయడం, దుక్కులు దున్నడం తదితర పనుల్లో నిమగ్నమయ్యారు. మరి కొందరు వరి నార్లు పోయడంతో పాటు ఆరుతడి పంటల సాగుకు మొగ్గ చూపుతున్నారు.

మండలంలో 13వేల ఎకరాల్లో పంటల సాగు

కరీంనగర్ మండలంలో పంటల సాగుకు అనువుగా 16.192 ఎకరాల విస్తీర్ణం ఉంది. వానకాలం సీజన్‌లో 13,550 ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధాన పంటగా వరి 12,623 ఎకరాలు, ఆరుతడి పంటలైన మక్క 929, వేరుశనగ 10, పెసర 24, మినుము 2, ఇతర అపరాల పంటలు 39 ఎకరాల్లో సాగు చేయనున్నారని పేర్కొంటున్నారు. కాగా, ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తుండడంతో సన్న రకం వరి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నాయి.

విత్తనాలు, ఎరువులు సిద్ధం

యాసంగి సీజన్‌కు సరిపడా విత్తనాలు, ఎరువులను వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో ఉంచుతున్నారు. వరి 3,600 క్వింటాళ్లు, మక్క 68 క్వింటాళ్లు, కంది 6 క్వింటాళ్లు, పెసర 2 క్వింటాళ్లు, బబ్బెర్లు 4 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేశారు. పంటల సాగులో ఉపయోగించే యూరియా 924 మెట్రిక్‌టన్నులు, డీఏపీ 678 మెట్రిక్‌టన్నులు, ఎంవోసీ 339 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 1,020 మెట్రిక్ టన్నుల ఎరువులను వినియోగిస్తారని అధికారులు అంచనా వేశారు. దుర్గేడ్ సింగిల్ విండో, కరీంనగర్ సింగిల్ విండో, కరీంన